# వరంగల్ వాయిస్
Evening Daily
www.warangalvoice.net
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 194 శుక్రవారం | 02 ఫిబ్రవరి 2024 | పేజీలు : 08 | వెల రూ. 5


## కార్యకర్తలను కాపాడుకునే బాధ్యత నాది



8లో

ఆపదలో తోడుగా ఉంటా

మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

## మేము వస్తాం..!

### కాంగ్రెస్‌లో చేరేందుకు ఇద్దరు సిద్ధం

డోర్నకల్ పట్టణానికి చెందిన ఇద్దరు నాయకులు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన 'మల్లి' కాంగ్రెస్ నాయకుడితో ఇంచార్జీ మంత్రి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో చేరేందుకు పావులు కదుపుతున్నట్లు ప్రచారం సాగుతోంది. మున్సిపాలిటీలో జరుగుతున్న వరుస ఘటణలను దారి మల్లించేందుకు ఈ చేరికలే నివారణ మార్గమని భావిస్తున్న నాయకులు కారు వీడి కాంగ్రెస్ చేయి పట్టుకునేందుకు సిద్ధమయ్యారని తెలుస్తోంది. మరో ప్రక్క మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ వీరి మూమెంట్స్ ని ఫాలో అవుతున్నారని వినికిడి.

– వరంగల్ వాయిస్, డోర్నకల్





8 లో..

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల దుర్మరణం

కేయూ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన



8లో

## పర్యావరణ సమతుల్యత అందరి బాధ్యత

మంత్రి కొండా సురేఖ

ఘనంగా చిత్తడి నేలల పరిరక్షణ దినోత్సవం

వివరాలు 2లో..



# తారు లేక జీవితాలు..

# తారుమారు



- ప్రమాదాలకు నిలయంగా రెడ్డిపురం రోడ్డు
- కంకర పోసి మరిచిన కాంట్రాక్టర్
- ఏడాదిన్నరగా ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- ధర్నా చేసినా స్పందించని జీడబ్ల్యూఎంసీ
- గ్రీవెన్స్‌లో పలు మార్లు ఫిర్యాదు
- అయినా పరిష్కారం కాని సమస్య

అధ్వానపు రహదారులు.. అడుగడుగునా గుంతలు.. వానొస్తే బురద బురద.. ఎండొస్తే దుమ్ము దుమ్ము.. బండెక్కితే ఉయ్యాల జంపాల.. కిలోమీటర్ దూరానికి పావుగంటకు పైగా సమయం.. దారిపొడవునా కుదుపులతో ఒళ్లంతా హూనం.. అదృష్టం బాగుంటే ఇంటికి.. లేదంటే దవాఖానకు.. ఇది నాటి సమైక్య రాష్ట్రంలో దుస్థితి. ఇక ఇలాంటి పరిస్థితి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కనిపించదు..రహదారులన్నీ అద్దంలా మెరిసిపోవాలి..అన్న తెలంగాణ తొలి ముఖ్యమంత్రి మాటలు నీటి మూటలుగా మారాయి. పది సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించినప్పటికీ రహదారుల పరిస్థితిలో ఏ మాత్రం మార్పురాలేదనడానికి హనుమకొండ జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోనే ఉన్న రెడ్డిపురం గ్రామ రోడ్లు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తున్నాయి. నిత్యం నరకం అనుభవిస్తున్న స్థానికులు రహదారిని నిర్మించాలంటూ పలుమార్లు బల్దియాలో నిర్వహించిన గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారే కరువయ్యారు. తారు లేక.. పలువురి జీవితాలు తారుమారయ్యాయంటూ ఆగ్రహించిన ప్రజలు రోడ్డెక్కి ధర్నా చేసినా అధికారులనుంచి స్పందన కరువైంది. – వరంగల్ వాయిస్, హనుమకొండ

# తారు లేక జీవితాలు..
# తారుమారు



**ప్రమాదాలకు నిలయంగా రెడ్డిపురం రోడ్డు**

**కంకర పోసి మరిచిన కాంట్రాక్టర్**

**ఏడాదిన్నరగా ఇబ్బందులు పడుతున్న స్థానికులు**

**ధర్నా చేసినా స్పందించని జీడబ్ల్యూఎంసీ**

**గ్రీవెన్స్‌లో పలు మార్లు ఫిర్యాదు**

**అయినా పరిష్కారం కాని సమస్య**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మారుమూల పల్లెల్లోనే కాదు నగరంలోని రహదారులు సైతం నరకాన్ని తలపిస్తున్నాయి. హనుమకొండ జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న రెడ్డిపురం గ్రామ రోడ్లు ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తున్నాయి. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎత్తుపల్లాలుగా మారిన ఈ రోడ్డుపై వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. దీంతో ఏదైనా పని మీద బయటికి వచ్చిన వారు అదృష్టం బాగుంటే ఇంటికి.. లేదంటే కాళ్లు, చేతులు విరిగి దవాఖానకు అన్నట్లుగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తారు లేకపోవడంతో ప్రమాదాలు జరిగి జీవితాలు తారుమారు అయ్యే పరిస్థితి నెలకొందంటున్నారు.

## ఏడాదిన్నరగా ఇబ్బందులు..

నగరంలోని యాదవనగర్ సర్కిల్ నుంచి రెడ్డి పురం రింగ్ రోడ్డు వరకు రూ.2 కోట్లతో బీటీ రోడ్డును వేసేందుకు ఏడాదిన్నర క్రితం అగ్రిమెంట్ కుదిరింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ సుమారు కిలోమీటర్ వరకు కంకర పోసి చదును చేయించి చేతులెత్తేశాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు బీటీ వేయడం మాత్రం మరిచిపోయారు. దీంతో స్థానిక వాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణించేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఇప్పటి వరకు పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోవడంతో గాయాలపాలుకాగు పలువురు మంచాలకే పరిమితం అయినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో ఒకరు ప్రమాదానికి గురై మృతి చెందిన సంఘటనను గుర్తు చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఎక్కడ కూడా విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు నిత్య కృత్యంగా మారాయని కాలనీ వాసులు వాపోతున్నారు.





## గ్రీవెన్స్‌లో ఫిర్యాదు..

యాదవ్ నగర్ సర్కిల్ నుంచి రెడ్డి పురం ఔటర్ రింగ్ రోడ్డు వరకు మొత్తం 2.5 కిలోమీటర్ల రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలని గతంలో పలు మార్లు రెడ్డి పురం విజయ లక్ష్మి కాలనీ వాసులమంతా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లో జరిగిన గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారే కరువయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రీవెన్స్ సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాలంటూ కమిషనర్, కలెక్టర్ ఆదేశాలు జారీ చేస్తున్నా రెడ్డి పురం రహదారి సమస్య మాత్రం కొలిక్కి రాలేదంటున్నారు. స్థానిక సమస్యను పరిష్కరించాలంటూ కాలనీ వాసులంతా కలిసి రోడ్డెక్కి ధర్నా చేసినా ఫలితం కానరాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రీవెన్స్ ఫిర్యాదుతో కాలనీకి వచ్చి రహదారిని పరిశీలించిన బల్దియా అధికారులు ఆ తర్వాత మిన్నకుండడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## గత ఎమ్మెల్యేకు వినతి..

గ్రీవెన్స్ లో సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో స్థానిక కార్పొరేటర్ తో కలిసి గత ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ను ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను ఆయన



దృష్టికి తీసుకెళ్లిన కూడా ఫలితం లేకుండా పోయిందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాదవ్ నగర్ సర్కిల్ నుంచి రెడ్డి పురం రింగ్ రోడ్డు వరకు జరిగే రోడ్డు పనులను ఆపివేయడంతో దుమ్ము ధూళి చేరుతుందని, అలాగే రోడ్లు గుంతలుగా ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయంటున్నారు. రోడ్డు పనులను మద్యంతరంగా నిలిపివేసిన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవడంతో పాటు వెంటనే రహదారి పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు. అలాగే విజయ లక్ష్మి కాలనీలోని సీసీ రోడ్లు, వీధి స్తంభాలు, డ్రైనేజీ ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



# బీజేపీలోకి విద్యార్థి ఉద్యమ నాయకుడు

**కండువా కప్పి ఆహ్వానించిన జిల్లా అధ్యక్షుడు రవికుమార్**


**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆధ్వర్యంలో ఎల్బీ కళాశాల విద్యార్థి ఉద్యమ నాయకుడు ఎర్రగోల్ల భరత్ వీర్ 50 మంది యువకులతో కలిసి శుక్రవారం ధర్మారంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో కాశాయం జెండా కప్పుకున్నారు. పార్టీలో చేరిన వారందరికీ బీజేపీ జెండా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ నాయకత్వాన్ని బలపరచడానికి యువత పెద్ద ఎత్తున బీజేపీలోకి వస్తున్నారన్నారు. ఏబీవీపీలో క్రియాశీలకంగా పని చేసిన భరత్ వీర్ పార్టీలోకి రావడం శుభసూచకం అన్నారు. వరంగల్ లోని యువతీ, యువకులకు బీజేపీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. మోడీ నాయకత్వంలో బీజేపీని ప్రతి బూతులో, ప్రతి మండలంలో బలపడుతోందన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపులో యువత కీలక భూమిక పోషించాలన్నారు. పార్టీని కిందిస్థాయి నుంచి బలోపేతం చేస్తున్నట్లు వెల్లడించారు. జాతీయ బావాలు, దేశభక్తి కలిగిన యువత బీజేపీలోకి రావాలని పిలుపునిచ్చారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపి నడ్డా, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి నాయకత్వంలో వరంగల్ జిల్లాలో పార్టీని నెంబర్ వన్ గా ఉంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఎర్రగొల్ల భరత్ వీర్ మాట్లాడుతూ బీజేపీలో చేరడం మంచి అవకాశంగా బావిస్తున్నానన్నారు. చిన్నప్పటి నుంచి జాతీయ భావాలతో ఆర్ ఎస్ ఎస్, ఏబీవీపీలో పని చేయడం నాకు కలిసి వచ్చిందన్నారు. గత బీఆర్ ఎస్ పాలనలో విద్యార్థులకు, యువతకు తీరని అన్యాయం జరిగిందన్నారు. వచ్చే పార్లమెంట్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగిరేలా పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు వన్నాల వెంకట రమణ, ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్, ఓబీసీ జిల్లా అధ్యక్షులు కందిమల్ల మహేష్, త్రిలోకేశ్వర్, శ్రీనివాస్ యాదవ్, అరుణ్ సాయి, చారి, శ్రీనివాస్, నవీన్, అజయ్, సుమన్, రాజ్ కుమార్, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

# క్లినికల్ వ్యర్థాలపై నిర్లక్ష్యం

**ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** క్లినికల్ ల్యాబ్ వ్యర్థాలతో ప్రజలకు తీరని ముప్పు వాటిల్లుతోందని వాటిని ఎక్కడపడితే అక్కడ పారేయడం ద్వారా పర్యావరణంతో పాటు ఆరోగ్యాలకు హాని కలుగుతోందని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో వాకర్స్ కు తక్కువ ధరకు ఆరోగ్య పరీక్షల పేరుతో నగరంలోని ఒక ప్రైవేట్ ల్యాబ్ వ్యక్తులు రక్త పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు పూర్తి కాగానే వాటికి సంబంధించిన వ్యర్థాలను అక్కడే వదిలిపోవడంపై శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వాడేసిన సిరంజీలతోపాటు ఇతర వస్తువులను శాస్త్రీయ పద్ధతిలో ధ్వంసం చేయాల్సింది ఉన్నప్పటికీ అవేమీ పట్టించుకోకుండా మైదానంలోనే వదిలి వెళ్ళటం శోచనీయమన్నారు. పదునైన చిరంజీవిలు ఇతరత్రా వాడేసిన వాటితో వాకర్స్ తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని ఆయన తెలిపారు. మరోసారి ఇటువంటి చర్యలు పునరావృతమైతే చట్టరీత్య, న్యాయపరమైన చర్యలు తీసుకోవడానికి వెనకాడబోమని ఆయన హెచ్చరించారు.



## మోడీ పాలనకు ప్రజలు బుద్ధి చెప్పాలి



**వరంగల్ వాయిస్, కాటారం :** నేడు మోడీ ప్రభుత్వం కులం పేరుతో, మతం పేరుతో ప్రజలను విభజిస్తూ ప్రజల మధ్య చిచ్చు పెడుతుందని ప్రజాసంఘాల నాయకుడు అక్కల బాపు విమర్శించారు. శుక్ర వారం కాటారంలో పత్రికా విలేకరుల సమావేశంలో ప్రజాసంఘాల నాయకుడు అక్కల బాపు మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్ వ్యవస్థకు కేంద్ర బీజేపీ ప్రభుత్వం అప్పగిస్తుందన్నారు. దేశంలో యూనివర్సిటీలు, పాఠశాలల కోసం బడ్జెట్ కేటాయించడం లేదన్నారు. గుడులకు, గోపురాలకు, విగ్రహాలకు వందల కోట్ల రూపాయలు ప్రజల ధనం కేటాయిస్తుందన్నారు. మరో ప్రక్క పేద ప్రజలు తిండి లేక, ఉద్యోగాలు లేక, రైతులకు గిట్టుబాటు ధర లేక, కార్మికులకు కనీస వేతనాలు లేక, మహిళలకు రక్షణ లేక అతలాకుతలమవుతుంటే అయోధ్యలో రామ మందిరం అని రాజ్యాంగానికి విరుద్ధంగా రాజకీయాలు నడిపిస్తున్నారన్నారు. ప్రధాని మోడీ బడాబడా కార్పొరేటు సంస్థలకు ప్రభుత్వ రంగ సంస్థలకు తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు. పెద్ద ఎత్తున ప్రజలు ప్రజాస్వామ్యవాదులు వాస్తవాల పైన పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా కేవలం మత విద్వేషాలు రేపుతూ 10 సంవత్సరాల పాలన కొనసాగించిందన్నారు. రాబోయే ఎన్నికల్లో మోడీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలోప్రజాసంఘాల నాయకులు పీక కిరణ్, శంకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అధికారిగా ఎంపీడీవో శంకర్



**వరంగల్ వాయిస్, కాటారం:** గ్రామ పంచాయతీ పాలకవర్గం గడువు ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమిస్తుంది. ఈ నేపథ్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గంగారం గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా కాటారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి మాలోతు శంకర్ నాయక్ ను నియమించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన గంగారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి బీరెల్లి కరుణాకర్, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## గడ్డం సమ్మయ్య ఎదిగిన తీరు ఆదర్శం



**వరంగల్ వాయిస్, జనగామ :** కేంద్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందించే పద్మశ్రీ పురస్కారాన్ని ఇటీవల అప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ చిందు యక్షగాన కళాకారులు గడ్డం సమ్మయ్యను కొమల్ల గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమ చిత్ర కారుకుడు, జనగామ జిల్లా ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు గజవెల్లి విజయకుమార్, తెలంగాణ ఉద్యమ కళాకారుడు, నవరస కళామండలి అధ్యక్షుడు గజవెల్లి శివాజీ మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. అట్టడుగు స్థాయి నుంచి పద్మశ్రీ అవార్డు వరకు ఆయన ఎదిగిన తీరు నేటి తరానికి ఆదర్శమన్నారు. ప్రాచీన కళకు ఈ అవార్డు ద్వారా జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని ఆనందం వ్యక్తం చేశారు. గడ్డం సమ్మయ్యకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గజవెల్లి ప్రతాప్, చింటు,కనకయ్య, రాజేష్, హిమగిరి, మురళి కృష్ణ, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

# జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలి

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక జవహర్ లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో యువజన సర్వీసుల శాఖ, తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో శుక్రవారం మెగా జాబ్ మేళాను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా వరంగల్ పశ్చిమ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్లు రాధిక గుప్త, శుక్లాలు హాజరయ్యారు. వరంగల్ పశ్చిమ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి





మాట్లాడుతూ హనుమకొండలో జాబ్ మేళా నిర్వహించడం చాలా సంతోషమని ఈ జాబ్ మేళాలో పాల్గొంటున్న 65పైగా కంపెనీలు సుమారు 5000వరకూ పైగా ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. వివిధ కంపెనీలు ఉద్యోగ అవకాశాల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగా ఇక్కడే విద్యావకాశాలు కల్పించడం జరిగిందని, యువతలో నైపుణ్యాలను వెతికి తీసేందుకు, యువతకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల్లో స్థానికంగా పెద్ద సంఖ్యలో ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతను ఆదుకోవడం కోసం ఇలాంటి మరిన్ని జాబ్ మేళాలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామని అన్నారు.

# కార్మిక వ్యతిరేక విధానాలపై సమశీల పోరు సాగించాలి

### సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు హేమలత

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ సీఐటీయూ జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాలు శుక్రవారం హనుమకొండ ఫాతిమా నగర్ లో గల బాలవికాసలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. జాతీయ సమావేశాల ప్రారంభ సూచకంగా సీఐటీయూ పతాకాన్ని జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కే.హేమలత ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులకు నివాళులు అర్పిస్తూ కళాకారులు పాటలు పాడారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిందాబాద్ కార్మిక వర్గ ఐక్యత వర్ధిల్లాలి, మతతత్వ విధానాలు నశించాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం వర్కింగ్ కమిటీ సమావేశాలను జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు కే హేమలత మాట్లాడుతూ ప్రపంచంలో ఆర్థిక సంక్షోభం పెరుగుతుందని, దీని ప్రభావం మన దేశం పైన తీవ్రంగా ఉందని, పేద, ధనిక తారతమ్యాలు తీవ్రమవుతున్నాయని, వాటి దుష్ఫలితాల వల్ల నిరుద్యోగం దారిద్యం పెరుగుతుందని ఘాటుగా విమర్శించారు. కనీస వేతనాలు ధరలకు అనుగుణంగా పెరుగకపోవడం వల్ల కొనుగోలు శక్తి క్షీణిస్తుందని ఆవేదన వెలిబుచ్చారు. కార్పొరేట్ కంపెనీలకు గణనీయ లాభాలు, కార్మికుల వేతనాలు క్షీణించడం ఒక ధోరణిగా ప్రభవించిందని, వ్యవసాయ ధరలు వ్యవసాయ రంగం గత ఐదేళ్లుగా సవాళ్లను ఎదుర్కొంటున్నాయని విమర్శించారు. ఈ సంక్లిష్ట పరిస్థితుల్లో 2024 ఫిబ్రవరి 16న గ్రామీణ భారత్ బంద్ కార్మిక సమ్మెకు కోట్లాది మంది సన్నద్ధమవుతున్నారని హేమలత తెలిపారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక రైతాంగ సమస్యలు పరిష్కరించలేక రామాలయ నిర్మాణం భావోద్వేగాల ఆధారంగా 2024పార్లమెంటు ఎన్నికల్లో గెలవాలని



డబ్బు అధికార దుర్వినియోగం తదితర అన్ని వస్త్రాలను ఉపయోగించుకునేందుకు ప్రయత్నిస్తుందని, బహుళ జాతి సంస్థల ప్రయోజనాల కోసం 139కోట్ల మంది ప్రజలు కార్మిక వర్గ హక్కులను ఫణంగా పెడుతుందన్న కేంద్ర బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాలని ఆమె పిలుపునిచ్చారు. జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాలను సీఐటీయూ హనుమకొండ జిల్లా కమిటీ నిర్వహిస్తుంది. ఈ సందర్భంగా ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ స్వాగత ఉపాన్యాసం చేశారు. పోరాటాల గడ్డ చారిత్రక నగరం హనుమకొండలో జాతీయ సమావేశాలు నిర్వహించడం సంతోషమన్నారు. ఈ సమావేశాలను ఉపయోగించుకొని రాబోవు కాలంలో ప్రజా కార్మిక సమస్యల మీద పోరాటాలు చేస్తామని, సీఐటీయూని బలోపేతం చేస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి జే వెంకటేష్, భూపాల్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి. ఉప్పలయ్య, ఆఫీస్ బేరర్స్ గాదె ప్రభాకర్ రెడ్డి, మెట్టు రవి, బొట్ల చక్రపాణి, సారంగపాణి, బి సంపత్, రజితలతో పాటు వర్కింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# గత పాలకుల నిర్లక్ష్యంతోనే నోచుకోని అభివృద్ధి

### పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి


**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణ కేంద్రంలోని పలు వీధుల్లో కాలనీలలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకోవడానికి శుక్రవారం పరకాల మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పర్యటించారు. అంగడి బజార్ మీదుగా కోర్టు నుంచి పాదయాత్ర ద్వారా పర్యటన ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి కొత్త మార్కెట్ బిల్డింగ్, దామర చెరువు మినీ ట్యాంకును పరిశీలించారు. కుంకుమేశ్వర దేవాలయం వద్ద ఆటో స్టాండ్, బస్టాండ్ వద్ద చిరు వ్యాపారస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి బస్టాండ్ మీదుగా డిపో వరకు సైడ్ డ్రైన్, లలితాదేవి హాస్పిటల్ వద్ద కల్వర్టు, శ్రీనివాస కాలనీలోని బ్రిడ్జి నిర్మాణ పనులు, మొగుళ్లపల్లి క్రాస్ డిపో దగ్గర రోడ్డు విస్తరణ పనులను, రాజధాని టీ హోటల్ నుంచి కనపర్తి రోడ్డును పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ దగ్గర, పోలీస్ స్టేషన్ వద్ద ట్రాఫిక్ సమస్య మరియు మురుగునీరు సమస్యను అడిగి తెలుసుకున్నారు. కూరగాయల మార్కెట్ రోడ్డు, ఆంధ్రాబ్యాంక్ దగ్గర కల్వర్టు, సెంటర్ సర్కిల్ చుట్టూ ఉన్న డ్రైనేజీ, భూపాలపల్లి క్రాస్ రోడ్డు డివైడర్, ప్రైమరీ స్కూల్ వద్ద డ్రైనేజీ, సీఎంఎస్ రోడ్డు, పాత పోస్టుమార్టన్ వద్ద స్థలం, కనకదుర్గమ్మ గుడి వద్ద ఉన్న కల్వర్టు, ఎమ్మారెడ్డి కాలేజీ ఎదురుగా డ్రైనేజీని, పోచమ్మ గుడి వద్ద లింకు డ్రైనేజ్ ని ఎమ్మెల్యే పరిశీలించారు. దామర చెరువు పనులు, డ్రైనేజీ, పారిశుధ్యంపై అసంపూర్తిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీ



వాసులతో ఆయన ముచ్చటించారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలు గత ప్రభుత్వంలో జరిగిన ఇబ్బందులను వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడం జరిగింది. ఈ సమస్యలను మున్సిపల్ కమిషనర్ తో మాట్లాడి వెంటనే సమస్యలను పరిష్కరించాలని అక్కడికక్కడే ఆదేశించారు. పరిష్కారానికి నా వంతుగా సహకారం ఏదైనా ఉంటే నేరుగా చెప్పాలని అన్నారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ గత పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వల్లే పరకాల పట్టణం అభివృద్ధిలో వెనుకబడిపోయిందన్నారు. పరకాల పట్టణ అభివృద్ధి లక్ష్యంగా ప్రజల, అధికారుల సహకారంతో ముందుకు వెళ్తానని అందుకు ఈనెల 7న రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపాలిటీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పట్టణ అభివృద్ధికి ప్రణాళిక రూపకల్పన చేస్తానని అన్నారు. పట్టణాభివృద్ధికి ప్రజలు సామాజిక బాధ్యతగా రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరూ తనకు సహకరించాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి కోరారు

వరంగల్ వాయిస్ Evening Daily
శుక్రవారం 02, ఫిబ్రవరి 2024
www.warangalvoice.net

# ఎంపీ టికెట్ కేటాయించాలని జోరిక రమేష్ విజ్ఞప్తి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** త్వరలో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా వరంగల్ లోక్ సభ బీఆర్ఎస్ టికెట్ కేటాయించాలని శుక్రవారం మాజీ కార్పొరేటర్, ఉద్యమనేత జోరిక రమేష్ పార్టీ నాయకులతో బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో హనుమకొండ జిల్లా అధ్యక్షులు, మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ ను కలిసి తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని సమగ్ర వివరాలతో కూడిన విజ్ఞాపన పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా జోరిక రమేష్ మాట్లాడుతూ ఉద్యమకారుడిగా వరంగల్ లోక్ సభ సెగ్మెంట్ పరిధిలోని వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, స్టేషన్ ఘణపురం, పరకాల, భూపాలపల్లి, పాలకుర్తి ఏడు నియోజకవర్గాల్లో ఉద్యమకారుడిగా, పార్టీ నాయకుడిగా విస్తృత పరిచయాలు ఉన్నాయని, గతంలో మూడు నియోజకవర్గాలు, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, స్టేషన్ ఘణపురం పరిధిలో ఉన్న డివిజన్ కు కార్పొరేటర్ గా పనిచేశానని తెలిపారు. నాకు కలిసొచ్చే అంశం, అలాగే ఉద్యమకాలంలోని ఉప ఎన్నికల్లో పరకాల, స్టేషన్ ఘనపురం, వరంగల్ పశ్చిమ (హనుమకొండ) నియోజకవర్గాల్లో అన్ని గ్రామాల్లో, నగరంలో పనిచేశానని అందరికి సుపరిచితమైన వ్యక్తిని, భూపాలపల్లి, పాలకుర్తి, వరంగల్ తూర్పులలో ఉద్యమ సమయం నుంచి పార్టీ కార్యక్రమాలలో పాదయాత్రలు , సమావేశాలల్లో పాల్గొన్నానని తెలిపారు. తనకు పార్టీ అవకాశం ఇచ్చినట్లయితే గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఇపుడున్న ప్రత్యేక పరిస్థితుల్లో పార్టీకి పూర్వవైభవం తీసుకరావాలంటే ఉద్యమకారుడికే టికెట్ ఇచ్చినట్లయితే, అన్ని వర్గాల ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు ఆమోదించడానికి సిద్ధంగా ఉన్నారని జోరిక రమేష్ కోరడం జరిగింది. అనంతరం వరంగల్ పశ్చిమ బీఆర్ఎస్ నేతలు, డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్ లు మాట్లాడుతూ జోరిక రమేష్ కు టికెట్ వచ్చేవిధంగా కృషిచేయాలని వినయ భాస్కర్ ను కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన వినయ భాస్కర్ మాట్లాడుతూ తప్పకుండా పార్టీ అధిష్టానం కేసీఆర్, కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తానని టికెట్ వచ్చేవిధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## గ్రామ పంచాయతీ సిబ్బందికి సన్మానం



**వరంగల్ వాయిస్, జనగామ :** కోమళ్ల గ్రామ పంచాయతీ ప్రాంగణంలో కోమళ్ల గ్రామ స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెటర్నరీ ఆఫీసర్ డా.రమ్యకు, నూతన సెక్రటరీ బాధ్యతలు స్వీకరించిన త్రివేణికి శుక్రవారం స్వాగతం పలుకుతూ శాలువాతో సన్మానించారు. అదే విధంగా గ్రామపంచాయతీ సిబ్బందిని సైతం కోమళ్ల మాజీ ఉప సర్పంచ్ మేకల మురళి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు మంకెన అన్నపురెడ్డి, నీల సంపత్, బొల్లపల్లి నరేష్, మాజీ సర్పంచ్ లు బండి యాదగిరి, సుల్తాన్ నరసింహ రెడ్డి, వివిధ పార్టీ నాయకులు తాటికొండ వెంకటేష్ యాదవ్, బొల్లపల్లి కుమారస్వామి, వెలుపుగొండ నరసింహులు, పేరబోయిన కొమురయ్య, గట్టయ్య, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌తో రైతు కూలీలకు తీరని నష్టం

### బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ తో రైతు కూలీలకు పేద వర్గాలకు నష్టంజరుగుతుందని బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించేందుకు యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మోడీ ప్రభుత్వం ప్రతి సంవత్సరం నిధులు కోత పెడుతూ ఆ పథకాన్ని రద్దు చేసేందుకు కుట్రలు పన్నుతున్నదన్నారు. ఈ బడ్జెట్ కార్పొరేట్ బడా పారిశ్రామికవేత్తలను, కుబేరులను మరింత కుబేరులుగా పేద వారిని మరింత పేదలుగా చేసేదిగా ఉందన్నారు. ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని, రానున్న పార్లమెంటు ఎన్నికల్లో పాలకులకు తగిన గుణపాఠం తప్పదని వెంకట్రాములు హెచ్చరించారు.

## శ్రీపాద స్మారక క్రికెట్ పోటీలు ప్రారంభం



**వరంగల్ వాయిస్, కాటారం :** మండల కేంద్రంలో శ్రీపాద స్మారక ఐదు మండలాల స్థాయి జీపీఎల్ 1 క్రికెట్ టోర్నమెంట్ ను శుక్రవారం ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సోదరులు దుద్దిళ్ల శ్రీనుబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీను బాబు మాట్లాడుతూ క్రీడల వలన మానసిక ఒత్తిడిని తగ్గించే అవకాశం ఉంది. కాబట్టి, అందరూ సాధ్యమైనంత వరకు ఈ క్రీడలో అయిన రోజులో కొంత సమయం కేటాయిస్తే ఆరోగ్యవంతంగా జీవించవచ్చున్నారు. యువకులు కేవలం చదువులోనే కాకుండా క్రీడా రంగంలో కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించే అవకాశం ఉందని, అలాగే యువతి యువకులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడా రంగంలో ముందుకు వెళ్లాలని కోరారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, గీసుగొండ :** మండలంలోని ఎలుకుర్తి (హ)గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మైదం ప్రేమనీల మరణించగా శుక్రవారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, సామాజికవేత్త అల్లం బాల కిషోర్ రెడ్డి సహకారంతో కాంగ్రెస్ పార్టీకీ చేసిన సేవలను గుర్తు చేసి వారి కుటుంబానికి రూ. 5000 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అల్లం మర్రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుమ్మలపల్లి శ్రీనివాస్, మాదాసి రాంబాబు, జిల్లా నాయకులు సాయిలి ప్రభాకర్, కందికొండ రాజ్ కుమార్, తోట కమలాకర్, ఎలుకుర్తి గ్రామ పార్టీ అధ్యక్షుడు నల్లా సురేష్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ గారంపెల్లి రమేష్, కాంగ్రెస్ శ్రేణులు రాజేశ్వర్ రావు, భాస్కర్, సంతోష్, తిరుపతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** హుజురాబాద్ కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ వారు భీమదేవరపల్లి మండలంలోని అన్ని పాఠశాలలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్ ను శుక్రవారం తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్ ముల్కనూరులో ట్రస్టు నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ (రిటైర్డ్ టీచర్)నిర్వహించారు. ఈ సైన్స్ టాలెంట్ టెస్ట్ కు మండలంలోని ఎనిమిది పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. సైన్స్ టాలెంట్ టెస్ట్ లో ప్రతిభ కనబరిచిన మొదటి 5మంది విద్యార్థులకు బహుమతులను ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్ ముల్కనూర్ ప్రిన్సిపాల్ కుమార్ చేతుల మీదుగా అందించారు. మొదటి బహుమతిగా ఏ.స్పందన తెలంగాణ మోడల్ స్కూల్ ముల్కనూర్ విద్యార్థికి రూ.500 నగదు శంకర్ నారాయణ డిక్షనరీ మెమొంటో రెండవ బహుమతిగా బి శ్రీవల్లి తెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ స్కూల్ వంగర విద్యార్థికి రూ.200 నగదు శంకర్ నారాయణ డిక్షనరీ మెమొంటో, మరో మూడు కన్సోలేషన్ బహుమతులు జి సంజన మోడల్ స్కూల్ ముల్కనూర్ ఎండి రహీం, జడ్పీహెచ్ఎస్ గట్ల నర్సింగాపూర్ కే ముఖేష్, జడ్పీహెచ్ఎస్ కొత్తపల్లి విద్యార్థులకు శంకర్ నారాయణ డిక్షనరీలతోపాటు మెమొంటోళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ అధ్యాపక బృందం, వివిధ పాఠశాలల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు ఎం కృష్ణమూర్తి, టి జన్నీకుమారి, అశోక్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## ఉత్తమ సిబ్బందికి ప్రశంసాపత్రాలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ప్రభుత్వ వాహనాల మైంటెనెస్ చేయడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్, సిబ్బందికి మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ జీ ప్రశంసాపత్రాలు అందజేశారు. మహబూబాబాద్ జిల్లా పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ లకు కేటాయించిన ప్రభుత్వ వాహనాలు ప్రతి ఏటా మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ఏఆర్ డీఎస్పీ విజయ ప్రతాప్, ఎస్ బీ సీఐ బాలాజీ వరప్రసాద్, ఆర్ఐ (ఎంటీఓ) టీం ప్రతి పోలీస్ స్టేషన్ లో వాహనాలు ఇన్స్పెక్షన్ చేసి రిపోర్ట్ తీసుకోవడం జరుగుతుంది. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ ఆదేశాల మేరకు ఈ సంవత్సరం కూడా తమకు కేటాయించబడిన వాహనాలు సక్రమంగా మైంటైన్ చేస్తూ వెహికల్ కండిషన్ లో ఉండేలా చూసుకుని విధులు నిర్వహిస్తున్న వారికి జిల్లా ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందించి అభినందించడం జరిగింది. ప్రతి సంవత్సరం ఇలాగే ఇన్స్పెక్షన్ నిర్వహించి వాహన మెయింటనెన్స్ లో ప్రతిభ కనపరచిన వారికి ప్రశంసలు అందుతాయని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, ఆర్ఐ(ఎంటీఓ)సోములు , సిబ్బంది పాల్గొన్నారు.

## మేడారం భక్తులకు పర్యావరణ రుసుం రద్దుపై హర్షం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ మేడారం సమ్మక్క సారలమ్మ దర్శనానికి విచ్చేస్తున్న భక్తులకు పర్యావరణ రుసుమును నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన సందర్భంగా టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ హర్షం వ్యక్తం చేశారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని నర్సంపేట్ రోడ్డులోని శ్రీ కనకదుర్గ జంక్షన్ లో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ టపాసులు కాల్చి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు పర్యావరణ రుసుమును నిలిపివేస్తున్నట్లు నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో హర్షం వ్యక్తం చేస్తూ టపాసులు కాల్చి మిఠాయిలు పంపిణీ చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వాలలో ఇలాంటి నిర్ణయాలు తీసుకోలేదని, సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఈ నిర్ణయం తీసుకోవడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సర్వర్యా సురేష్ కుమార్, జంగం ప్రభాకర్, గుల్లపల్లి రామకృష్ణ, సర్దార్ జస్వీర్ సింగ్, కట్కూరి అన్వేష్, ఎర్రం మణిదీప్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు గూడ శారద, పుట్ట నలిని, కొప్పుల ఉమా భవాని, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

## పల్లెలో స్పెషల్ అధికారుల పాలన



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** తెలంగాణ రాష్ట్రంలోని సర్పంచులు వార్డు మెంబర్ల పదవీకాలం గురువారం ముగిసింది. శుక్రవారం నుంచి గ్రామ పంచాయతీల్లో స్పెషల్ ఆఫిసర్ల పాలన ప్రారంభం కానుంది. వివిధ శాఖలో పనిచేస్తున్న గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారులను గ్రామ పంచాయతీ పాలన బాద్యతలకు (స్పెషల్ ఆఫీసర్ల) వీలు కల్పిస్తూ గురువారం మానుకోట జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇరిగేషన్,రెవెన్యూ, పంచాయతీ రాజ్, అగ్రికల్చర్, హార్టికల్చర్, ఎడ్యుకుషన్, ఆర్అండ్ బీలో పనిచేస్తున్న గెజిటెడ్ అధికారులకు స్పెషల్ ఆఫీసర్లుగా నియమించారు. ఇప్పటికే గ్రామ పంచాయతీ సర్పంచుల నుంచి రికార్డులు, డిజిటల్ కీలు సెక్రటరీలు స్వాధీనం చేసుకున్నారు. డోర్నకల్ మండలంలోని గొల్లచర్ల, హున్య తండా, లింబియా తండాకు తహసీల్దార్ నాగ భవాని, మన్నెగూడెం,జోగ్యతంగా కు వ్యవసాయ అధికారి మురళీ మెహన్,పెరుమండ్ల సంకీసా, బొడ్రాయి తండాకు ఆర్డబ్ల్యూఎస్ ఏఈ అరుణ, రావీగూడెం మల్లాయికుంట తండా కు ఆర్ అండ్ బీ ఏఈ చైతన్య, అమ్మపాలెం బంజారా గ్రామానికి ఇరిగేషన్ ఏఈ హార్దిక, తోడెళ్లగూడెం,కస్నతండా,కొత్త దుబ్బ తండా ఎంపీడీవో చలపతి రావు, చిల్కోయలపాడు, కన్నెగుండ్లకు ఇమ్మల్ల సామ్రాజ్, ఉయ్యాలవాడ, దుబ్బ తండా, బూరుగుపాడు గ్రామాలకు డిప్యూటీ తాసిల్దార్ వీరన్న, ముల్కలపల్లి హెచ్ఎం రుక్మంగాధర్ రావు, చాపలతండ, రాము తండా, వెన్నారంలకు ఎంపీఓ మున్వర్ బేగ్, చిల్కోడుకు హెచ్యం వీరభద్రం,ఫకీరతండా, గుర్రలకుంట తండాకు సీడీపీఓ ఎల్లమ్మ, తెల్లబండ తండా, పాతదుబ్బతండాకు పీఆర్ ఎఈ సఫ్దార్ అలీ, అందనాలపాడు, మోత్తుగడ్డ తండాకు ఉద్యానవన అధికారి అనిత శ్రీలను నియమించుతు కలెక్టర్ కార్యలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

## అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ప్రతాప రుద్ర ఫిల్టర్ బెడ్ లో డీఈ సారంగపాణి, ఏఈ సతీష్ కుమార్ తో రివ్యూ మీటింగ్ సమావేశంలో 13వ డివిజన్ కార్పొరేటర్ సురేష్ కుమార్ జోషి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోషి డివిజన్ లో పెండింగ్ లో ఉన్న సీసీ రోడ్డు డ్రైనేజ్ నూతనంగా నిర్మించే అభివృద్ధి పనులను అంశాల గురించి వివరించి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా మంచి నీటి సమస్యలు ఉన్న ప్రాంతంలో కాలనీ ప్రజలకు నీటి కొరత లేకుండా పరిష్కరించాలని కోరారు.

## సీపీని కలిసిన భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్ రాజు శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూను మార్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పాగుచ్చలను అందజేశారు. ఈ సందర్భంగా ఇరువురు పోలీస్ అధికారులు పలు అంశాలపై ముచ్చటించుకున్నారు.

## పదవికే విరమణ.. సేవకు లేదు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి ప్రత్యేక పాలనాధికారుల చేతుల్లోకి గ్రామాల పాలన వెళ్తున్నందున గురువారం డోర్నకల్ మండల ఫకీరతండా గ్రామ పంచాయతి కార్యాలయంలో పంచాయతి సిబ్బంది, నాయకులు,గ్రామ ప్రముఖులు, ప్రజలు, యువకులు కలిసి తమ సర్పంచ్ గుగులోత్ సునీత వీరన్నకు వీడ్కోలు, అభినందన సభను ఘనంగా ఏర్పాటు చేశారు. శాలువాలు, పూల మాలలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేసి వారికి ఘనంగా వీడుకోలు పలికారు. గ్రామ ప్రజల ప్రేమాభిమానాలకు పులకించిపోయిన సర్పంచ్ ఆనందభాష్పాలతో ప్రతీ ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు. సోసైటీ మాజీ అధ్యక్షులు రాయల వెంకటేశ్వర్లు, రాయల నరేష్, సూబానీ, ఉప సర్పంచ్ భూక్య నందు, వార్డు మెంబర్లు జేతురాం, బాబు, మోహన్, సైదులు, రామ, కాళీ, కిషన్ చందు, వీరు వెంకట్రాం, బాబు, సుక్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికలపై దృష్టి సారించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ -ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కోసం భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు శు క్రవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అద్యక్షులతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేసి పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమాన్ని ప్రతిడివిజన్ లో ముమ్మరంగా చేపట్టాలని హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ పిలుపునిచ్చారు. తదనంతరం వినయ్ భాస్కర్ అదేవిధంగా టెలి కాన్ఫరెన్స్ లో కేటీఆర్ మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుకగా మండలిలో బీఆర్ఎస్ పార్టీ బలపరిచే అభ్యర్థిని గేలిపించుకునేందుకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గతంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపిస్తే కేసీఆర్ నాయకత్వంలో నిరుద్యోగులకు 2లక్షల 30వేల ఉద్యోగాలను భర్తీ చేయడమే కాకుండా ఐటీ రంగంలో 9లక్షల ఉద్యోగాలు, టీఎస్ ఐపాస్ విధానం ద్వారా విదేశీ పెట్టుబడులను తీసుకోచ్చి ప్రైవేటు రంగంలో పరిశ్రమల పెట్టడం ద్వారా సుమారు 17లక్షల ఉద్యోగాలను గత కేసీఆర్ ప్రభుత్వం కల్పించడం జరిగిందని తెలిపారు. శాసన మండలిలో నిరుద్యోగుల పక్షాన కొట్లాడే గొంతుకగా బీఆర్ఎస్ పార్టీ నిలిచిందని తెలుపుతూ గ్రాడ్యుయేట్లు అందరూ భారత రాష్ట్ర సమితి బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతు నిలిచేందుకు సిద్దంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలతో పని చేయిస్తే కఠిన చర్యలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ వివిధ శాఖల సహకారంతో ప్రతి ఏటా రెండుసార్లు జనవరి నెలలో ఆపరేషన్ స్మైల్, జూలై నెలలో ఆపరేషన్ ముస్కాన్ వంటి కార్యక్రమాలను నిర్వహించి అనేక మంది బాలకార్మికులకు విముక్తి కల్పించడం జరుగుతుందని ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ అన్నారు. ఇందులో భాగంగానే ఈ సంవత్సరం అపరేషన్ స్మైల్ -X అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య గారి నేతృత్వంలో 58 మంది బాల కార్మికులకు విముక్తి కల్పించడం జరిగింది. ఇందులో 12 మంది అమ్మాయిలు ఉండగా 46 మంది బాలురు ఉన్నారు. వారిని సీడబ్ల్యూసీ, డీసీపీఓ వారికి అప్పగించడం జరిగిందని, తదుపరి పిల్లలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరచి పిల్లలకు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. బాలలను కార్మికులుగా పెట్టుకున్న యజమానులపై మొత్తం 38 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనపరచిన ఆర్ఎస్ఐ సునందా (మహబూబాబాద్ టీం), ఎస్ఐ మౌలానా (తొర్రూర్‌టీం) వారికి ప్రశంసా పత్రం అందజేశారు

## రేపు ఓబీసీ సాధన సభ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రేపు హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఓబీసీ సాధన సభను విజయవంతం చేయాలని అరె సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు వుస్నగిరి శ్రీకాంత్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరె కులానికి ఓబీసీ సర్టిఫికెట్ లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓబీసీ సర్టిఫికెట్ లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఉద్యోగాలలో అవకాశాలు రాకుండా పోతున్నాయన్నారు. ఓబీసీ సాధన కోసం హైదరాబాద్ లోని నాచారం రాఘవేంద్ర నగర్ లోని ఏఎన్ఆర్ గార్డెన్ లో నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్ద మొత్తంలో ఆరె కులస్తులు తరలిరావాలని కోరారు.

## ఫీజు నియంత్రణ చట్టం తేవాలి

### ఆర్టీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అధిక ఫీజులు వసూలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఫీజు నియంత్రణ చట్టం తేవాలని ఆర్టీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చంటి ముదిరాజ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా స్కూల్స్ లో అధిక ఫీజులు పేద పిల్లల దగ్గర వసూలు చేయడమే కాకుండా, ఫీజులు కట్టకుంటే హాల్ టికెట్స్, సర్టిఫికెట్ లు ఇవ్వడం లేదన్నారు. కనీసం ఇప్పుడు ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ఫీజులు వసూలు చేసే స్కూల్స్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొన్ని కార్పొరేట్ స్కూల్స్ లో లక్షల లక్షలు వసూలు చేస్తున్నారని, వాటి పైన నిఘా పెట్టి ఫీజు నియంత్రణ చట్టం ఏర్పాటు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పిల్లల ఫీజులలో రాయితీ కల్పించాలన్నారు. అలాగే జర్నలిస్ట్ పిల్లలకు స్కూల్స్, కాలేజీ లలో ఉచిత విద్యను అందించాలని కోరారు.

## ఆర్టీఓ రంగారావును కలిసిన వడుప్స వరంగల్ జిల్లా ప్రతినిధులు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వడుప్సా వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆడెపు శ్యామ్ ఆధ్వర్యంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వరంగల్ జిల్లా ఆర్టీవో పి.రంగారావును మర్యాదపూర్వకంగా కలిసి బొకే, శాలువాతో సత్కరించి శు భాకాంక్షలు తెలియజేశారు. పాఠశాలల బస్సుల సమస్యలపై చర్చించడం జరిగింది. వారు సానుకూలంగా స్పందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రస్మా (వడుప్సా) వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బిల్లా రవి, జిల్లా సలహాదారులు కోడెం శ్రీధర్, ప్రైవేట్ విద్యాసంస్థల బస్సు ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గాదె స్వరూప్ రెడ్డి, ఖిలా వరంగల్ జోన్ అధ్యక్షుడు ముక్కెర రవీందర్, ప్రధాన కార్యదర్ దాసి సతీష్ మూర్తి, వరంగల్ జోన్ కోశాధికారి కూరపాటి మోహన్, వరంగల్ జోన్ ఉపాధ్యక్షుడు కూచన క్రాంతి కుమార్, జోన్ కన్వీనర్లు బండి చక్రపాణి, శ్రీనివాస్, వడిచర్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బీటి రోడ్డుపై చెత్తను తొలగించండి



**వరంగల్ వాయిస్, ములుగు :** ఆసియా ఖండంలోని అతిపెద్దదైన మేడారం జాతర ఈనెల 21 నుంచి 24 వరకు జరిగే సమ్మక్క సారక్క జాతరకు దేశ నలుమూల నుంచి ఇప్పటికే దాదాపు 15 నుంచి 20 లక్షలకు పైగా భక్తులు వచ్చి సమ్మక్క సారక్కలను దర్శించుకొని వెళ్తున్నారు. కానీ, చింతల్ వద్ద నుంచి మేడారం పోయే బీటీ రోడ్డు పక్కనే ఉన్న చెట్లు గుబురుగా ఉండేసరికి మూల మలుపుల వద్ద ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల చింతల్ నుంచి మేడారం జాతరకు వచ్చే రోడ్డుకు సైడుకు ఉన్న చెట్లను తొలగించాలని కోరారు. చెట్లను తొలగిస్తే ప్రమాదాలు జరగే అవకాశాలు ఉండవని భక్తులు చెబుతున్నారు. త్వరగా సంబంధిత అధికారులు రోడ్డు పక్కనే ఉన్న చెట్లను తొలగించి భక్తులకు ప్రమాదం జరగకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.




# మరో గ్రామీణ నేపథ్యం..

## ప్రజలకు దగ్గరగా అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్

యువ నటుడు సుహాస్ ఇంతకు ముందు 'కలర్ ఫోటో' సినిమాతో వచ్చీరాగానే జాతీయ అవార్డు గెలుచుకుంది. తరువాత 'రైటర్ పద్మభూషణ్' అనే సినిమాలో కూడా కథానాయకుడిగా చేసాడు, ఆ సినిమాకి మిశ్రమ స్పందన వచ్చింది, కానీ నిర్మాతకి డబ్బులు వచ్చాయి అన్నారు. ఇప్పుడు అదే సుహాస్ 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఇంతకు ముందు అతని రెండు సినిమాలకి ఇద్దరు కొత్త దర్శకులు పరిచయం అయితే, ఈ సినిమాతో దుష్యంత్ అనే ఇంకో దర్శకుడు పరిచయం అయ్యాడు. ఈ సినిమా కథా నేపథ్యం దర్శకుడు దుశ్యంత్ తన స్వీయ అనుభవాలు, అలాగే తన ఊర్లో జరిగిన కొన్ని నిజ సంఘటనల ఆధారంగా తీశానని విడుదలకి ముందు చెప్పారు. నటి శరణ్య ఇందులో ఇంకో ప్రధాన పాత్ర పోషించింది. ఈ కథ ఒక పీరియడ్ డ్రామా అంటే 2007 ప్రాంతంలో అంబాజిపేట అనే గ్రామంలో జరిగినది. ఆ ఊర్లో పెద్ద మనిషిగా వున్న వెంకట్ (నితిన్ ప్రసన్న), అదే వూర్లో చాలామందికి అప్పులు ఇచ్చి వడ్డీలు వసూలు చేసుకుంటూ ఉంటాడు. ఆలా వూర్లో చాలామందిని తన గుప్పిట్లో పెట్టుకుంటాడు. అతని దగ్గర డబ్బులు తీసుకున్న ఆ ఊరి గ్రామస్థులు కొందరు అతను అసలు డబ్బులు ఎప్పుడు కట్టమంటాడా అని అతనికి భయపడుతూ బతుకుతూ ఉంటారు. అదే గ్రామంలో మల్లి (సుహాస్) తన కులవృత్తిని చేసుకుంటూనే మ్యారేజి బ్యాండులో పని చేస్తుంటాడు. అతను అక్క పద్మ (శరణ్య) కవలలు, పద్మ చదువుకున్నది, అందుకని అదే ఊర్లో వున్న స్కూల్ లో ఉపాధ్యాయురాలిగా పని చేస్తుంటుంది. పద్మకు వుద్యోగం ఇప్పించింది వెంకట్ అని, అతనికి పద్మకి మధ్య ఏదో సంబంధం ఉందని ఊరంతా పుకార్లు నడుస్తుంటాయి. ఇదిలా ఉండగా మల్లి, వెంకట్ చెల్లి లక్ష్మీ (శివానీ) ని ప్రేమిస్తాడు, ఆమెకి కూడా మల్లి అంటే ఇష్టం. మల్లి, పద్మ ల పుట్టినరోజు నాడు ఒక సంఘటన జరుగుతుంది, అది ఇంకో సంఘటనకి దారితీస్తుంది. ఇక ఇక్కడ నుండి కథ మొదలవుతుంది. ఆరోజు ఏమైంది, డబ్బు, పరపతి, అధికులం అనుకున్న వెంకట్ ఏమి చేసాడు, అతను చేసిన పనికి మల్లి, పద్మలు ఎలా ప్రతిస్పందించారు, లక్ష్మి, మల్లిల ప్రేమ సఫలం అయిందా, చివరకి ఈ సంఘటనలు అన్నీ ఎటు దారితీసాయి అనేది సినిమా కథ. ఈమధ్య కాలంలో 'బలగం' తరువాత సహజసిద్ధమైన కథతో, సన్నివేశాలతో, తెరమీద నటులు కాకుండా ఆయా పాత్రలు మాత్రమే కనపడే సినిమా ఏదైనా వచ్చింది అంటే అది ఈ 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' మాత్రమే అని చెప్పొచ్చు. దర్శకుడు దుష్యంత్ ఒక చిన్న సంఘటన ఆధారంగా రాసుకున్న కథ వెండితెర మీద అంతే సహజంగా చూపించడంలో సఫలం అయ్యాడు. ఈ సినిమాతో పరిశ్రమకి ఇంకో కొత్త యువ దర్శకుడు పరిచయం అయ్యాడు అనే చెప్పాలి. సమాజంలో అధికులం, డబ్బు, పరపతి, అహంకారంతో విర్రవీగే ఊరి పెద్దమనిషిగా చెలామణి అయ్యే అతనిని బయపడి బతుకుతున్న ఆ ఊరి ప్రజలు, ఓపిక నశించిపోయి ఎదురుతిరిగే కొంతమంది యువకులు, ఇలాంటి కథలు ఎన్నో గ్రామాల్లో జరిగాయి. విన్నాం కూడా. ఈ 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' కథ కూడా అటువంటిదే, కొత్తదేమీ కాదు, కానీ దర్శకుడు ఈ కథని చాలా సహజంగా కొత్తగా చూపించాడు. ఇది ఒక ప్రేమ కథ అనుకుంటే పొరపాటే, ఒక యువతి తన ఆత్మభిమానం కోసం పోరాటం చేసే కథ. దర్శకుడు ప్రతీ సన్నివేశాన్నీ ఎక్కడ నాన్చకుండా చాలా చక్కగా సహజంగా చూపించాడు. ముఖ్యంగా రెండో సగంలో భావోద్వేగాలు చాలా ఎక్కువగా ఉంటాయి, ప్రేక్షకుల హృదయాల్ని కట్టి పడేస్తాయి. ఇక ఈ సినిమాకి సంగీతం ఇచ్చిన శేఖర్ చంద్ర చాలా అద్భుతమైన నేపథ్య సంగీతం సమకూర్చాడు అనే చెప్పాలి. కొన్ని సన్నివేశాలకి ప్రేక్షకులు చప్పట్లు కొట్టారంటే దానికి ఒక ప్రధాన కారణం శేఖర్ చంద్ర ఇచ్చిన సంగీతం అనే చెప్పాలి. పాటలు, నేపథ్య సంగీతం రెండూ బాగుంటాయి. అలాగే ఛాయాగ్రహణం ఈ సినిమా కథకి అనుగుణంగా ఉంటుంది, ఆ వూరు, ప్రజలు, సన్నివేశాలు సహజంగా కనపడటానికి ఛాయాగ్రహణం ఎంతో ఉపయోగపడింది. పద్మకి రాసిన మాటలు హత్తుకుంటాయి, ఆలోచింపచేస్తాయి. గ్రామీణ వాతావరణంలో వచ్చిన సినిమాలు వున్నా, ఒక మహిళా పాత్రని ఇంత బలంగా చూపించడం ఈమధ్య కాలంలో ఈ సినిమాలోనే చూపించాడు దర్శకుడు. పతాక సన్నివేశాలు కూడా వైవిధ్యంగా ఉంటాయి, ఒకరికొకరు చంపుకోవటం కాదు పరిష్కారం, మనం చంపితే హంతకుడు అంటారు అనే మాటతో బాగా చూపించాడు. 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' సినిమా ఎంతో సహజ సిద్ధంగా, ఎక్కడో ఇలా జరిగే ఉంటుంది అని అనుకునే సంఘటనలతో రాసిన కథ. దర్శకుడు దుష్యంత్ కి పూర్తి మార్కులు, అలాగే నటీనటులు అందరూ ఎంతో సహజంగా నటిస్తూ, ప్రతి సన్నివేశాన్ని ఆకట్టుకునేట్టు చేశారు. ముఖ్యంగా శరణ్య పాత్రకి ఈలలు చెప్పట్లు, సుహాస్ మరో అద్భుతమైన పాత్ర పోషించాడు. మన చుట్టుపక్కల జరిగే సంఘటనలతో మన తెలుగు కథని, భావోద్వేగమైన సన్నివేశాలతో ఎలా ప్రేక్షకుల మెప్పు పొందాలో చూపించిన సినిమా ఇది.



# తమిళంలో అడుగు పెట్టిన నిహారిక

మెగా ఫ్యామిలీ నుంచి హీరోయిన్ గా వచ్చిన ఒకే ఒక్క నటి నిహారిక కొణిదెల. ఇటీవలే నిహారిక తన భర్త చైతన్యతో విడాకులు తీసుకుంది. విడాకుల తర్వాత నిహారికా చాలా యాక్టవ్ అయ్యింది. సోషల్ మీడియాలో ఈ అమ్మడు రెగ్యులర్ ఫోటోలు షేర్ చేస్తూ.. అభిమానులకు టచ్ లోనే ఉంటుంది. అయితే హీరోయిన్ గా నిహారిక ఎక్కువ సినిమాల్లో నటించలేదు. ఆమె తిరిగి సినిమాల్లో హీరోయిన్ గా నటించాలని మెగా ఫ్యాన్స్ ఎప్పటినుంచో కోరుకుంటున్నారు. ఎట్టకేలకు ఇప్పుడు నిహారిక సినిమాల్లోకి రీ ఎంట్రీ ఇస్తుంది. దాదాపు ఐదేళ్ల తర్వాత నిహారిక సినిమాలో నటించనుంది. నిహారిక 2016లో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. 'ఒక మనసు' సినిమాతో హీరోయిన్ గా మారింది నిహారిక. ఈ సినిమాలో నాగ శౌర్య హీరోగా నటించాడు. అయితే ఈ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయింది. ఆతర్వాత ఒకటి రెండు సినిమాల్లో నటించింది. మెల్లగా సినిమాలకు దూరమైన ఈ చిన్నది యూట్యూబ్ వీడియోలు చేస్తూ బిజీ అయ్యింది. ఆ తర్వాత నిర్మాణరంగం వైపు అడుగులేసింది.ఇన్నాళ్లకు మళ్లీ నటనతో ఆకట్టుకోవడానికి రెడీ అవుతుంది నిహారిక.తమిళంలో నిహారిక కొత్త సినిమా రెడీ అవుతోంది. ఈ చిత్రానికి 'మద్రాస్కరణ్' అనే టైటిల్ ను ఖరారు చేశారు. మలయాళ నటుడు షేన్ నిగమ్‌తో కలిసి నిహారిక స్క్రీన్‌ను పంచుకుంటుంది. షేన్‌కి ఇదే తొలి తమిళ సినిమా. నిహారికకు ఇది రెండో తమిళ చిత్రం. గతంలో నిహారిక 'ఒరు నల్ల బల్ పాతు సోల్రన్' అనే తమిళ సినిమాలో నటించింది. తాజాగా ఈ సినిమా నుంచి నిహారిక పోస్టర్ ను రిలీజ్ చేశారు.



## నటి పూనమ్ పాండే
# హఠాన్మరణం

గర్భాశయ క్యాన్సర్‌తో మరణించినట్లు వెల్లడి బాలీవుడ్ మోడల్, హీరోయిన్ పూనమ్‌పాండే శుక్రవారం హఠాన్మరణం చెందారు. కొన్నాళ్లుగా గర్భాశయ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆమె ఉదయం తుది శ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఆమె సిబ్బంది సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. పూనమ్ మరణించే సమయానికి క్యాన్సర్ ఫైనల్ స్టేజ్‌లో ఉందని, ఉత్తర ప్రదేశలోని తన స్వగృహంలోనే ఆమె కన్ను మూసిందని మేనేజర్ పారుల్ వెల్లడించారు. ఇంటర్ చదువుతుండగా మోడలింగ్‌లోకి వచ్చిన పూనమ్ నషా చిత్రంతో బాలీవుడ్‌కి హీరోయినగా ఎంట్రీ ఇచ్చింది. అర్ధ నగ్న ఫొటోలతో కుర్రకారుకి నిద్ర లేకుండా చేసేది. అందాల ప్రదర్శనే ఆమెను అనేక వివాదాల్లోకి లాగింది. విమర్శలకు గురి చేసింది. హీరోయినగా కంటే ఆమె వివాదాలతోనే ఎక్కువ పాపులారిటీ సంపాదించింది. గర్భాశయ క్యాన్సర్‌తో పూనమ్ మృతి చెందిందనట్లు పూనమ్ పాండే రియల్ అనే ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వార్త విన్న పూనమ్ అభిమానులు షాక్‌కు గురవుతున్నారు. 'ఈ ఉదయం మాకు చాలా కఠినమైనది. గర్భాశయ క్యాన్సర్‌తో పూనమ్ పాండే మరణించారని తెలియజేయడానికి చాలా బాధపడుతున్నాను. ఈ దుఃఖ సమయంలో ఆమెను గుర్తుచేసుకోవాల్సి ఉంది' అని ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పేర్కొన్నారు. కాన్పూర్‌లో జన్మించిన పూనమ్ పాండే మోడల్‌గా కెరీర్ ప్రారంభించింది. తొలుత ఓ షార్ట్ ఫిల్మ్‌లో నటించి 2013లో 'నషాతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టి తొలి చిత్రంతోనే హాట్‌బ్యూటీగా గుర్తింపు తెచ్చుకుంది. హిందీతోపాటు కన్నడ, తెలుగు, బోజ్‌పురి భాషల్లో నటించింది. తెలుగులో మాలిని అండ్ కో చిత్రంలో నటించింది. ఆమె నటించిన చివరి చిత్రం ద జర్నీ ఆఫ్ కర్మ.

# కార్యకర్తలను కాపాడుకునే బాధ్యత నాది

## ఆపదలో తోడుగా ఉంటా

## మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** బీఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత తనదేనని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హామీ ఇచ్చారు. శుక్రవారం నగరంలోని 37 వ డివిజన్ కార్పొరేటర్ భోగి సువర్ణ సురేష్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి నరేందర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఓడిపోయామన్న దిగులు చెందకుండా కార్యకర్తలు ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. మీకు ఏ చిన్న ఆపద వచ్చినా తోడుగా ఉంటానన్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ ప్రవేశ పెట్టిన ఆరు గ్యారెంటీలను 100 రోజుల్లో అమలుచేయక పోతే వదిలేదే లేదన్నారు. పార్టీ సభ్యత్వం ద్వారా ప్రమాద బీమా పొందిన బిళ్ళ శ్రావణ్ తండ్రి ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందగా మంజూరైన రూ.2లక్షల ప్రొసీడింగ్ పత్రాన్ని వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బిళ్ళ శ్రీకాంత్, డివిజన్ ఇంచార్జి బిల్లా రవి, డివిజన్ అధ్యక్షుడు విజయ్, ముఖ్య నాయకులు రాంబాబు, ధర్మరాజు, ఉమేష్, కర్ణాకర్, ఉల్ఫాత్, అభిషేక్, మోహిస్, సతీష్, నవీన్, ఎల్లయ్య, మురళి, ఏలియా, హరి తదితరులతో పాటు మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### 34వ డివిజన్‌లో..

నగరంలోని 34 వ డివిజన్ కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరై కార్యకర్తల్లో భరోసా నింపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పగడాల సతీష్, ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాలనలో రెవెన్యూ ఉద్యోగుల పాత్ర కీలకం

## కలెక్టర్ ప్రావీణ్య

## తాహసిల్దార్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ తహసిల్దార్స్ అసోసియేషన్ 2024 సంవత్సరం డైరీ, క్యాలెండర్ ను జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కీలకమైన రెవెన్యూ శాఖ ఉద్యోగులు ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజలకు చేరవేసే విషయంలో అత్యంత కీలకంగా వ్యవహరించాలని సూచించారు. ఉద్యోగుల సంక్షేమానికి అన్నివేళలా తాము సిద్ధమని తెలిపారు. ఉద్యోగుల సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర సహా అధ్యక్షులు బండి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు మహమ్మద్ ఇక్బాల్ అహ్మద్, ఫణికుమార్, రాజేష్ గౌడ్, రమేష్, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్, సర్వేశ్వర్, రాజు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# పర్యావరణ సమతుల్యత అందరి బాధ్యత

## మంత్రి కొండా సురేఖ

## ఘనంగా చిత్తడి నేలల పరిరక్షణ దినోత్సవం



**వరంగల్ వాయిస్, రంగారెడ్డి :** ప్రభుత్వ కృషికి ప్రజల భాగస్వామ్యం తోడైతేనే పర్యావరణ సమతుల్యత సాధ్యపడుతుందని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా నెక్నంపూర్ సరస్సు వద్ద నిర్వహించిన 'చిత్తడి నేలల పరిరక్షణ దినోత్సవం (ఫిబ్రవరి 2)' వేడుకలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటడంతో పాటు, చిత్తడి నేలలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ఎగ్జిబిషన్ స్టాళ్ళను మంత్రి పరిశీలించారు. విద్యార్థులను ఆసక్తిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మంత్రితో చేయి కలిపేందుకు ఉత్సాహం చూపారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ, చిత్తడి నేలల సంరక్షణకు అనుసరించాల్సిన విధానాలపై మంత్రి సురేఖ మాట్లాడారు. పూర్వకాలంలో కాలుష్యం ఉండేది కాదని, జనాభా పెరుగుతున్నది కొద్దీ ప్రజలు అవగాహన లేమితో బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తుంటంతో కాలుష్యం పెరుగుతున్నదన్నారు. నాడు రసాయనాల ప్రభావంలేని ఆహారాన్ని తిన్నవారు వయస్సు మీద పడినా ఆరోగ్యంగా ఉంటే, నేడు 30 ఏళ్ళు దాటితే చాలు బిపి, షుగర్, కాళ్ళ నొప్పులంటూ అనారోగ్యంబారిన పడుతున్నారని అన్నారు. ప్లాస్టిక్ మానవాళి పట్ల శాపంగా మారిందని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల స్థానంలో పేపర్ బ్యాగులను వాడాలని ప్రజలకు మంత్రి పిలుపునిచ్చారు.

మనం ఏదైనా కార్యాన్ని అంతఃకరణ శుద్ధితో ఆచరించినప్పుడే, ఇతరులకు చెప్తే ఆచరిస్తారని చెప్తూ ఆధ్యాత్మిక గురువు రామకృష్ణ పరమహంస జీవితంలోని ఒక ఘట్టాన్ని ప్రస్తావించారు. పాఠశాలల ఉపాధ్యాయులు, యాజమాన్యాలు పర్యావరణ పరిరక్షణ దిశగా విద్యార్థులను ప్రోత్సాహించాలని సూచించారు. పర్యావరణ పరిక్షణలో కీలకమైన చిత్తడి నేలలను కలుషితాల బారి నుంచి రక్షించినప్పుడే మానవ మనుగడకు, ఇతర జీవరాశుల మనుగడకు అనుకూల వాతావరణం నెలకొని ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. రామ్ సర్ ఒప్పందం లో పేర్కొన్న ప్రమాణాలకు అనుగుణంగా భారతదేశంలో 74 వెట్ ల్యాండ్ స్పాట్స్ ఉండగా, తెలంగాణ ప్రస్తుతానికి అమీన్ పూర్ లో ఒక వెట్ ల్యాండ్ స్పాట్ ను గుర్తించినట్లు మంత్రి తెలిపారు. టూరిస్టులు సేదతీరడానికి వెట్ ల్యాండ్ స్పాట్స్ చాలా ఆహ్లాదకరంగా ఉంటాయని, వీటిని టూరిస్ట్ డెస్టినేషన్ లుగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని అన్నారు. ప్రభుత్వ కార్యాచరణకు తోడు ప్రజల సహకారం తోడైతే చిత్తడి నేలల పరిరక్షణ మహాకార్యం విజయవంతమవుతుందని పిలుపునిచ్చారు. చిత్తడి నేలల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీమతి వాణి ప్రసాద్, తెలంగాణ స్టేట్ బయోడైవర్సిటి బోర్డ్ సెక్రటరీ కాళిచరణ్ ఎస్ ఖర్తడే, ఎం.సునీల, శిల్పా శర్మ తదితర అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల దుర్మరణం

## కేయూ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన





**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న పెట్రోల్ పంప్ కు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెలితే.. గురువారం రాత్రి 11.30 గంటలకు బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఇద్దరు మిత్రులు బొజ్జ విశ్వతేజ, తిప్పని సూర్యతేజ మరొక స్నేహితుడితో కలిసి ఒకే బైక్ పై కేయూ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రముఖ కళాశాల వద్దకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఇండియన్ ఆయిల్ బంక్ సమీపంలో వేగంగా డివైడర్ ను ఢీ కొన్నారు. దీంతో వెనుక కూర్చున్న విశ్వతేజ, సూర్యతేజ ఇద్దరూ ఎగిరి కింద పడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. రక్తపు మడుగులో పడి ఉన్న వారిని గమనించిన వారి మిత్రులు తిరుమల్, సుదింద్ర హుటాహుటిన ఎంజీఎం తరలించారు. కాగా చికిత్స పొందుతూ విశ్వతేజ మృతి చెందాడు. సూర్యతేజను అతని కుటుంబ సభ్యులు హైదరాబాద్ లోని యశోద ఆసుపత్రికి తరలించినప్పటికీ ప్రాణాలు దక్కించుకోలేక పోయారు. మరి కొద్ది రోజుల్లో చదువు పూర్తి చేసి ఉద్యోగం సాధించి తల్లి దండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటారనుకుంటే ఇలా దుర్మరణం పాలు కావడంతో వారి కుటుంబాల్లో విషాదం అలుముకుంది. బొజ్జ విశ్వతేజ తండ్రి బొజ్జ చంద్రమౌళి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇన్ స్పెక్టర్ అబ్బయ్య కేసు నమోదు చేసి శవ పంచనామా నిర్వహించారు.

# లక్ష్య సాధన దిశగా కృషి చేయాలి

## చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు కజాంపురం దామోదర్



**వరంగల్ వాయిస్, మడికొండ :** విద్యార్థులు లక్ష్య సాధన దిశగా కృషి చేసి జీవితంలో రాణించాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు కజాంపురం దామోదర్ అన్నారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం మడికొండ సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ ఎండి ఖుర్షీద్ అధ్యక్షతన విద్యార్థులకు మోటివేషనల్ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి, మోటివేటర్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు దామోదర్ మాట్లాడుతూ పిల్లలకు మొదటి గురువు తల్లి, రెండో గురువు తండ్రి అని తర్వాత విద్యా సంస్థలో పనిచేసే ఉపాధ్యాయులేనని అన్నారు. ఐదేండ్ల లోపు పిల్లల మానసిక వికాసం ఎనభై ఐదు శాతం కుటుంబ వ్యవస్థపైనే ఆధారపడి ఉంటుందన్నారు. అయితే కాలానుగుణ మార్పులు, ప్రతికూల వాతావరణం కారణంగా ఆది సాధ్యపడడం లేదనిన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుల పాత్ర ప్రతి విద్యార్థికి భవిష్యత్ దిశా నిర్దేశం చేసే విధంగా ఉంటుందన్నారు. అందుకు విద్యార్థి ఇష్టంతో కష్టపడి చదివితేనే సాధ్యమవుతుందన్నారు.

చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎస్.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పద్దెనిమిది సంవత్సరాలలోపు బాల బాలికలకు బాలల న్యాయ చట్టం (రక్షణ సంరక్షణ) ప్రకారం సేవలు అందిస్తున్నామని, ఆపదలో ఉన్న బాల బాలికల తక్షణ పునరావాస చర్యల కోసం ఇరవై నాలుగు గంటలు పనిచేసే ఉచిత టోల్ ఫ్రీ నంబర్ 1098 కు కాల్ చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఎండి ఖుర్షీద్ మాట్లాడుతూ అధ్యాపకుల సహకారం ఉన్నంత కాలం చదవాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తారన్నారు. చైల్డ్ హెల్ప్ లైన్ కో ఆర్డినేటర్ ఎస్.భాస్కర్ మాట్లాడుతూ బాలల హక్కులు, బాల్య వివాహాలు, చట్టాలు, ఆపదలో ఉన్న వారికి తక్షణ పునరావాస గురించి చేపడుతున్న చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఔట్ రీచ్ వర్కర్ పి.విజయ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ యు.వీరాచారి, ఉపాధ్యాయులు బి.యాదగిరి, బి.భాస్కర్ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com